పాలకొల్లులో రూ.62 వేలు స్వాధీనం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఎన్నికల అధికారుల ప్రత్యేక టీం బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.62 వేలు స్వాధీనం చేసుకున్నారు. అసిస్టెంట్ ఆఫీసర్ కె.గోవిందరాజులు సారథ్యంలో ఎన్నికల ప్రత్యేక విభాగం మొబైల్ చెక్‌పోస్ట్‌ను పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసింది. శనివారం తనిఖీలు చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు రూ.62 వేలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. తగిన ఆధారాలు చూపించకపోవడంతో సొమ్మును ఎన్నికల ప్రత్యేక స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది.

తనిఖీ చేస్తున్న సిబ్బంది

పొసగని పొత్తు..!

టిడిపి, జనసేన నేతల నడుమ వీడని విభేదాలు

పలు నియోజకవర్గాల్లో ఎవరి దారి వారిదే అన్నట్లు పరిస్థితి

తణుకు, నరసాపురం, పోలవరం, ఏలూరులో కొరవడిన సఖ్యత

అసంతృప్తులంతా ఎడమొహం, పెడమొహమే

ఆత్మీయ సమావేశాలతో కలుపుకునేందుకు అభ్యర్థుల యత్నం

నరసాపురం బిజెపి అభ్యర్థికీ టిడిపి, జనసేన నాయకులు దూరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన నాయకుల మధ్య పొత్తు పొసగడం లేదు. టిక్కెట్ దక్కని నాయకులు, వారి అనుయాయులు తీవ్ర అసంతృప్తితో ఎడమొహం, పెడమొహం అన్నట్లు ఉంటున్నారు. దీంతో టిక్కెట్ దక్కించుకున్న అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగుతుందా.. సఖ్యతతో మసలుకుంటారా అనే అనుమానం ఇరుపార్టీల కేడర్‌లోనూ నెలకొంది. నరసాపురం నియోజకవర్గ టిక్కెట్ జనసేనకు దక్కిన సంగతి తెలిసిందే. జనసేన అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్‌కు అవకాశం లభించింది. దీంతో ఇక్కడ టిక్కెట్ ఆశించిన టిడిపి నాయకులు పొత్తూరి రామరాజు, కొవ్వలి రామ్మోహనాయుడు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చి దాదాపు 15 రోజులు గడిచిపోయింది. నాయకర్‌కు టిక్కెట్ ప్రకటించి పది రోజులైంది. ఇప్పటికీ జనసేన అభ్యర్థికి టిడిపి నాయకుల నుంచి తగిన మద్దతు లభించడం లేదని తెలుస్తోంది. దీంతో జనసేన నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నరసాపురం నియోజకవర్గంలో టిడిపి నాయకులు జనసేన అభ్యర్థి నాయకర్‌కు సహకారిస్తారా, లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. అధినాయకులు జోక్యం చేసుకుంటే తప్ప సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు కన్పించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తణుకు సీటు టిడిపికి కేటాయించడంతో మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ రంగంలోకి దిగారు. జనసేన టిక్కెట్ ఆశించిన విడివాడ రామచంద్రరావు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటి వరకూ ఆరిమిల్లి, విడివాడ కలిసి నియోజకవర్గంలో ఒక్కరోజు కూడా తిరిగిన పరిస్థితి లేదు. ఇటీవల మాజీ మంత్రి పితాని సత్యనారాయణ నివాసం వద్ద జరిగిన సమావేశంలోనూ జనసేన నాయకుల నుంచి సహకారం లేదంటూ ఆరిమిల్లి చెప్పినట్లు తెలిసింది. గ్రామాల్లో జనసేన కేడర్ కొంత మద్దతుగా ఉన్నప్పటికీ ప్రధాన నాయకులు దూరంగా ఉండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలవరం టిక్కెట్ పొత్తులో జనసేనకు దక్కింది. దీంతో టిడిపి నుంచి టిక్కెట్ ఆశించిన బొరగం శ్రీనివాస్, ఆయన అనుయాయులు తీవ్ర అసంతృప్తితో రోడ్డెక్కారు. జనసేనకు తమ సహకారం ఉండదని బహిరంగంగానే టిడిపి నాయకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. రకరకాల ఊహాగానాల అనంతరం జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజుకు అవకాశం దక్కింది. పోలవరం నియోజకవర్గంలో టిడిపి నేతలు స్థబ్దతగా ఉన్నారు. పోలవరం నియోజకవర్గంలో టిడిపికి బలమైన ఓటుబ్యాంకు ఉంది. జనసేన అభ్యర్థి గెలవాలవంటే టిడిపి నాయకత్వం పెద్దఎత్తున కృషి చేయాల్సిందే. అయితే అక్కడడా పరిస్థితి మాత్రం కానరావడం లేదు. ఇరుపార్టీల నాయకుల మధ్య సయోధ్య కుదిరి ఎన్నికల్లో ముందుకు సాగుతారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఏలూరు ఎంఎల్ఎ టిక్కెట్ టిడిపికి కేటాయించడంతో బడేటి చంటి బరిలోకి దిగారు. జనసేన టిక్కెట్ ఆశించిన రెడ్డి అప్పలనాయుడు, ఆయన అనుయాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తాను ఇండిపెండెంట్‌గా పోటీకి దిగుతానని రెడ్డి అప్పలనాయుడు మాట్లాడిన పరిస్థితి. పార్టీ పెద్దల జోక్యంతో రెడ్డి అప్పలనాయుడు శాంతించినట్లు కన్పిస్తున్నా, ఎన్నికల పోరులో చురుగ్గా లేరని స్పష్టంగా తెలుస్తోంది. ముందుముందు పొత్తు పొసుగుతుందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి. ఆచంట, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, ఉండి వంటి చోట్ల టిడిపి, జనసేన నాయకులు కలిసి ప్రచారం నిర్వహిస్తున్నా కొన్ని నియోజకవర్గాల్లో అటువంటి పరిస్థితి లేకుండాపోవడం గెలుపోటములపై ప్రభావం చూపుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థికి టిడిపి, జనసేన దూరం

టిడిపి, జనసే, బిజెపి పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం బిజెపికి కేటాయించారు. ఆ టిక్కెట్ భూపతిరాజు శ్రీనివాసవర్మకు దక్కింది. అయితే బిజెపి అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజుకు టిక్కెట్ దక్కుతుందని టిడిపి, జనసేన అభ్యర్థులు ఆశించారు. దీంతో వారంతా శ్రీనివాసవర్మ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా సమావేశం సైతం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. శ్రీనివాసవర్మ నుంచి ఎంఎల్ఎ అభ్యర్థులకు ఆర్థిక సాయం ఏమీ ఉండదని, దీంతో ఎన్నికల్లో తీవ్ర ప్రభావం పడుతుందని టిడిపి, జనసేన అభ్యర్థులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బిజెపి ఎంపీ అభ్యర్థికి, టిడిపి, జనసేన నాయకులకు మధ్య సయోధ్య లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికీ నరసాపురం టిక్కెట్ నాకే అంటూ రఘురామకృష్ణంరాజు చెబుతుండటంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్ ఎక్కువయ్యేలా చర్యలు

జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం

సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో శాంతియుతంగా ఎక్కువ శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. సెక్టార్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తప్పక మూడుసార్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వశిష్ఠ కాన్ఫరెన్స్ హాలులో ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన అసిస్టెంటు రిటర్నింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, ఉప తహశీల్దార్లు, అసెంబ్లీస్థాయి మాస్టర్ ట్రైనర్లు (ఎఎల్ఎంటిఎస్)లతో ప్రీ-పోలింగుపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలోని సెక్టోరల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తప్పక మూడుసార్లు తనిఖీ చేసి, లొకేషన్, రూట్ మ్యాప్‌ను పరిశీలించాలన్నారు. ప్రతి పోలింగు బూత్ పరిధిలో స్థానిక ఓటర్లతో బిఎల్ఒలతో కలిసి రెండుసార్లు సమావేశాలు ఏర్పాటు చేయాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎంతశాతం ఓటింగ్ నమోదైంది, కొన్ని కేంద్రాల్లో ఓటింగు శాతం ఎందుకు తగ్గింది తదితర కారణాలు తెలుసుకుని సాధారణ ఎన్నికల్లో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగు కేంద్రాల్లో ఓటింగు శాతం పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు.

బూత్‌ల్లో సదుపాయాల కల్పనకు చర్యలు

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ప్రత్యేక కేటగిరీకి చెందిన విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్, ట్రాన్స్‌జెండర్ ఓటర్లకు పోలింగ్ సమయంలో అసౌకర్యం కలగకుండా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా, ఎక్కడా ఎంసిసి ఉల్లంఘన జరగకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 1,463 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా అన్నిరకాల ఏర్పాట్లను సంబంధిత ఎఆర్ఒల ద్వారా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు, తాగునీరు, రవాణా, షామియానా, పార్కింగ్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, సూచిక బోర్డుల ఏర్పాటుకు ఆదేశించినట్లు తెలిపారు.

ఉపాధి కూలి రూ.375 ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ కూలి పెంపుపై ప్రభుత్వం నియమించిన అనూప్ సత్పత్తి కమిటీ చెప్పినట్లు రూ.375 ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు పెరిగిన ధరలతో పోలిస్తే ఎంత కూలి ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం నియమించిన అనూప్ సత్పత్తి కమిటీ రూ.375 ఇవ్వాలని చెప్తే కేవలం రూ.300 అంటే రూ.272కి అదనంగా రూ.28 పెంచి చేతులు దులుపుకుందన్నారు. ఇప్పటికే ఉపాధి హామీలో అనేక పనులను తొలగించి అనేక నిబంధనలు, యాప్‌లు, ఆన్‌లైన్ మస్టర్ల విధానంతో ఉపాధి హామీ ఉసురు తీస్తున్న ప్రభుత్వం కనీసం వేతనం కల్పించడంలో కూడా వివక్ష చూపుతుందన్నారు. ఇప్పటికే బడ్జెట్‌లో రోజురోజుకు నిధులు కుదిస్తూ ఉపాధి హామీని నిర్వీరం చేసే కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి గ్రామీణ ప్రాంతాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించి ఆన్‌లైన్ మస్టర్ రెండు పూటలా పనిని వెనక్కి తీసుకోవాలని కోరారు.

వరి, ఆక్వా రైతులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

వరి, ఆక్వా రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, అధికారులను కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొద్దిరోజుల్లో వరి పొలాలు మాసూళ్లకు వస్తున్నాయన్నారు. గత సీజన్‌లో రైతులు చాలా అవస్థలు పడ్డారని తెలిపారు. కొనుగోళ్లలో ఇబ్బందులతోపాటు ధాన్యం సంచులు సకాలంలో సరఫరా చేయలేదన్నారు. అమ్మిన తర్వాత సొమ్ము సకాలంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు. దూరపు మిల్లులకు కేటాయించారని చెప్పారు. దీంతో రైతులు నానావస్థలు పడ్డారన్నారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని, సంచుల కొరత లేకుండా చూడాలని అన్నారు. దూరప్రాంతాలకు కాకుండా రైతులు సులభతరంగా అమ్ముకునేలా చూడాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందన్నారు. ఈ 15 రోజులు వరిచేలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరారు. ఆక్వా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, బడా కంపెనీలు సిండికేట్ అయ్యి రొయ్య కొనుగోలు ధరను దిగ్గోస్తున్నారని విమర్శించారు. ఒకపక్క ఆక్వా సాగు చాలా ఖరీదైపోయిందని, మరోపక్క తెగుళ్లతో ఆక్వా రైతులు నష్టాల సాగు చేస్తున్నారని, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కబుర్లు చెప్పడం తప్ప ఆక్వా రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వారిని పట్టించుకుని విద్యుత్ రాయితీలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వమే ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని కోరారు. కరెంటు కోతలు లేకుండా చూడాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

శశి విద్యార్థులకు ఉత్తమ ఎన్ఎస్ఎస్ అవార్డులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన షేక్ సల్మాన్‌బాషా ఉత్తమ ప్రోగ్రాం అధికారిగా, జి.యామిని ఉత్తమ వాలంటీర్ విద్యార్థినిగా జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ ఉత్తమ జాతీయ సేవా పథకం అవార్డులను పొందారని కళాశాల ప్రిన్సిపల్ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ జివి.ప్రసాదరాజు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.సుమలత, ఒఎస్‌టి ప్రొఫెసర్ కోటేశ్వరరావు, ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ ఈ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులను సామాజిక సేవ ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే విధంగా తోడ్పాటు అందిస్తామన్నారు. అవార్డులు అందుకున్న షేక్ సల్మాన్‌బాషా, యామినిలను కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపల్ మహ్మద్ ఇస్మాయిల్ అభినందించారు.

అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

ఎక్స్‌రే ద్వారా కూడా కోవిడ్-19ను గుర్తించొచ్చు

ఎస్ఆర్‌కెఆర్ కళాశాల ప్రొఫెసర్ చలపతిరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ విధానంలో తీసిన ఎక్స్‌రే ద్వారా కోవిడ్-19 కచ్చితమైన నిర్ధారణ చేయవచ్చుని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కనుమూరి చలపతిరాజు అన్నారు. ఆయన తన పరిశోధనలతో నూతన విధానాన్ని కనుగొన్నారు. ఆయన చేసిన పరిశోధనలకు గాను కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ చలపతిరాజును కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ, నిషాంత వర్మ యాజమాన్యం తరపున ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చలపతిరాజు మాట్లాడుతూ సుమారు 20 వ్యాధులకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డీప్ లెర్నింగ్ మిషన్ లెర్నింగ్ విధానంతో తీసిన ఎక్స్‌రేతో రోగ నిర్ధారణ చేసేందుకు ఆస్కారం ఉందన్నారు. తక్కువ సమయంలో రోగ నిర్ధారణ చేసేందుకు తమ పరిశోధన ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రేణుమాధవి పర్యవేక్షణలో డెవలప్‌మెంట్ ఆఫ్ కంప్యూటేషన్ ఇంటిలిజెన్స్ మోడల్ టు సపోర్ట్ డయోగ్నోసిస్ ఆఫ్ కోవిడ్-19 ఫ్రమ్ చెస్ట్ ఇమేజెస్ అంశంపై తాను చేసిన పరిశోధనకు విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్-19ను గుర్తించడంలో భారతీయ యువ శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు చేస్తున్నారని, అందులో తమ కళాశాల యువ అధ్యాపకులు కూడా భాగస్వాములు కావటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. సొసైటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఛాలెంజ్‌గా తీసుకుని వాటి సమస్య సాధనకు పిహెచ్‌డిలు చేస్తే సొసైటీకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ చలపతిరాజును సత్కరిస్తున్న ఎస్ఆర్‌కె నిశాంత్‌వర్మ

సిబిఐ స్పెషల్ పిపికి అభినందనల వెల్లువ

శోభనారాణిని అభినందిస్తున్న చినిమిల్లి గణపతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ గంధం వెంకట సుబ్బారావు సతీమణి గంధం శోభనారాణి విజయవాడ సిబిఐకోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శోభనారాణిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ చినిమిల్లి గణపతి ఆమెను అభినందించారు. గణపతితో పాటు అడ్వకేట్ కొండేటి శ్రీనివాస్, నాగరాజు, చినిమిల్లి రాంబాబు, గుణ్ణం వసంత్, పొన్నాడ భార్గవ్, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

సువిధ యాప్‌పై అవగాహన అవసరం

ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

ఎన్నికల ప్రచారం కోసం తీసుకునే అనుమతులకు సంబంధిత శాఖల మార్గదర్శకాలు విధిగా పాటించాలని, ఆ మేరకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సువిధ యాప్‌పై రాజకీయ పార్టీల నాయకులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సమావేశాలు, మైక్ ద్వారా ప్రచారం, వాహనాల అనుమతి, వీడియో వ్యాన్, ఇంటింటా ప్రచారం, బహిరంగ సభలు, ర్యాలీల కోసం సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు కోరే సందర్భాల్లో ఆయా శాఖల మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సందేహాలను నివృత్తి చేసుకోవడానికి టెక్నికల్ అధికారి వి.పూర్ణబాబ్జి 9963590272 సంప్రదించాలని తెలిపారు. అన్ని పార్టీలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రచార సభల కోసం సమాన అవకాశాలు కలుగజేసేలా అవసరమైన అనుమతులు జారీ చేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియాపై నిఘా ఉందని, ప్రతి పోస్టుకు గ్రూప్ అడ్మినే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. ఎవరైనా అభ్యంతరకర పోస్టులు పెట్టడం, షేర్ చేయడం వంటివి చేస్తే వెంటనే గ్రూపు నుంచి తొలగించకపోతే అడ్మిన్‌పై తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. అడ్మిన్ వివాదాస్పద పోస్ట్ పెడితే క్రిమినల్ కేసులకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి

బిజెపి నరసాపురం ఎంపీ అభ్యర్థి వర్మే

ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ పాకా సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ పార్టీ నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మేనని, ఆరు నూరైనా అభ్యర్థి మారే అవకాశం లేదని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ పాకా సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలనేది మాత్రమే కూటమి నేతలు నిర్ణయిస్తారని, తాము పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను జాతీయ నాయకత్వం ఎంపిక చేస్తుందని స్పష్టం చేశారు. బిజెపి అభ్యర్థిని మార్చుతారంటూ సాగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తన విజయం ఖాయమని, ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశామని తెలిపారు. ఏదేమైనా బిజెపి నరసాపురం ఎంపీ సీటు కూటమి నుంచి దక్కించుకున్నా అభ్యర్థి విషయంలో ఏర్పడిన గందరగోళంతో ఆ పార్టీ శ్రేణులు సైతం ఇదేమి చిత్రం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. పార్టీలో లేని వ్యక్తి టిక్కెట్ నాదే అనడం తమ పార్టీ నాయకత్వ లోపమేనని పలువురు బిజెపి నేతలు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

చెక్‌పోస్టులు సమర్ధవంతంగా పనిచేయాలి

ఉప్పుటేరు వద్ద జెసి తనిఖీలు

ప్రజాశక్తి - ఆకివీడు

చెక్‌పోస్టులు 24 గంటలూ సమర్ధవంతంగా పని చేయాలని జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దు ఉప్పుటేరు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టులు 24 గంటలూ సమర్ధవంతంగా పని చేయాలని, రిజిస్టర్లలో ప్రతిదీ పక్కాగా నమోదు చేయాలని చెప్పారు. నగదు, మద్యం, మాదక ద్రవ్యాలను తరలించకుండా కట్టడి చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద భద్రతా చర్యలు పటిష్ఠంగా చేపట్టాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలీసులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు.

చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న జెసి ప్రవీణ్‌ఆదిత్య

ఓట్లు లేకున్నా ఫీట్లు..!

బిజెపి తీరుపై జనం విస్మయం

'ఓట్లు చూస్తే తక్కువ.. ఫీట్లు చూస్తే ఎక్కువ' అన్నట్లుంది ఉమ్మడి జిల్లాలో బిజెపి పరిస్థితి. ఓట్లే కాదు కేడర్ కూడా పరిమితంగానే ఉన్నా పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం నుంచి రెండు, మూడుసార్లు, తాడేపల్లిగూడెం, కైకలూరు అసెంబ్లీ స్థానాల నుంచి ఒక్కోసారి బిజెపి గెలిచింది. సింగిల్‌గా పోటీ చేస్తే కనీసం పది శాతం ఓట్లు కూడా రాని పరిస్థితి ఆ పార్టీది. అయితే తాజాగా ఏలూరు, నరసాపురం సీట్ల కోసం ఆ పార్టీ నేతలు చేసిన ఫీట్లు, ఆపై నరసాపురం ఎంపీ అభ్యర్థిని ఖరారు చేశాక ఇప్పటికీ ఆ పార్టీలో చేరని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు తానే కూటమి ఎంపీ అభ్యర్థినని ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కేంద్రంలో అధికారంలో ఉండి, క్రమశిక్షణ కలిగిన పార్టీగా చెప్పుకునే ఆ పార్టీ జిల్లా నేతలే ప్రస్తుత పరిణామాలు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం నుంచి బిజెపి పోటీ చేస్తుందని అంతా భావించినట్లే ఆ పార్టీకే సీటు ఖరారైంది. అయితే నరసాపురంలో బలమైన అభ్యర్థి లేరంటూ ఏలూరు సీటు పొత్తులో కోరాలని బిజెపి గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపనా చౌదరి) అధినేతలపై ఒత్తిడి తెచ్చారు. దీనికి ముందు నుంచే ప్రణాళికగా బూత్ నేతల సమావేశం సైతం ఏలూరులో నిర్వహించి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సైతం ఆహ్వానించారు. అయినప్పటికీ ఏలూరు సీటు బిజెపికి ఇచ్చే అవకాశం లేదని తెలియడంతో తపనా చౌదరి ఆత్మీయ సమావేశం పేరిట హడావుడి చేసి ఏలూరు ఎంపీ సీటు నుంచి బిజెపియే పోటీ చేయాలని నేతలచే తిరుగుబావుటా ఎగురవేయించారు. ఈలోపు నరసాపురం ఎంపీ సీటే బిజెపికి కేటాయించడంతో సిట్టింగ్ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజే అభ్యర్థి అవుతారని అంతా ఊహించారు. తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభలో



రఘురామకృష్ణంరాజు తాను కూటమి తరఫున బరిలో ఉంటానని ప్రకటించడంతో ఆ దిశగానే పెద్దఎత్తున ప్రచారం సాగింది. అయితే అనూహ్యంగా బిజెపి జాబితాలో రఘురామకృష్ణంరాజు పేరు లేకపోగా నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి, భీమవరం వాసి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేరు ఖరారైంది. దీంతో రఘురామకృష్ణంరాజు కంగుతిన్నారు. ఈ క్రమంలో ఆ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో టిడిపి, జనసేన ఎంఎల్ఎ అభ్యర్థులు మాజీ మంత్రి పితాని ఇంట సమావేశమై శ్రీనివాసవర్మ ఎంపీ అభ్యర్థి అయితే తమకు ఇబ్బంది అని, రఘురామకృష్ణంరాజు అభ్యర్థి అయితేనే బాగుంటుందని ఘంటాపథంగా చెప్పడంతోపాటు టిడిపి అధినేత చంద్రబాబు దృష్టికి పితాని తీసుకెళ్లేలా చేశారు. ఈ క్రమంలో భీమవరం చేరుకున్న ఎంపీ రఘురామకృష్ణంరాజు కూటమి సీటు తనదేనని, ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తానని ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే అటు టిడిపి, జనసేన ఎంఎల్ఎ అభ్యర్థుల తీరు, ఇటు రఘురామకృష్ణంరాజు ప్రకటనలపై బిజెపి శ్రేణులు తీవ్ర అసంతృప్తి, నిర్వేదం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. తమ పార్టీ అభ్యర్థి ఎవరనేది ఎంత మిత్రపక్షమైనా ఇతర పార్టీలు ఎలా నిర్ణయిస్తాయని, అభ్యర్థిని ఎంపిక చేసేంత స్థాయి గల నేతలు తమ పార్టీలో లేరా అని ఆవేదన వ్యక్తం చేస్తుండటం బిజెపిలో నెలకొన్న గందరగోళానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. శ్రీనివాసవర్మే తమ అభ్యర్థి అని బిజెపి స్థానిక నేతలు చెబుతున్నా రఘురామకృష్ణంరాజు టిక్కెట్ ఎక్కడ ఎగరేసుకుపోతారోననే ఆందోళన వారికీ లోలోన ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. సీటు దక్కినా నరసాపురం నియోజకవర్గంలో బిజెపి శ్రేణులు అభ్యర్థి విషయంలో తీవ్ర గందరగోళంలో కొట్టుమిట్టాడుతుండే, సీటు దక్కక ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో శ్రేణులు నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. మొత్తానికి ఓట్లు లేకున్నా బిజెపి నేతల ఫీట్లు చూసి ఆ పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

మద్యం తాగి బస్సు నడిపిన డ్రైవర్

కారును ఢీకొట్టి నిర్లక్ష్యంగా సమాధానం

ప్రజాశక్తి - ఉండి

విధుల్లో ఉండి మద్యం సేవించిన బస్సుడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు. మండలంలోని కోలమూరు వద్ద బస్సుడ్రైవర్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడమే కాకుండా దర్జాగా సిగరెట్ కాలుస్తూ అతిగా హడావుడి చేశాడు. తాడేపల్లిగూడెం డిపోకు చెందిన బస్సు భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తుండగా కోలమూరు వద్ద కారును ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు బస్సును వెంబడించి మార్గమధ్యలో ఆపారు. వారితో బస్సు డ్రైవర్ సిగరెట్ కాలుస్తూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్ తాగేసి నిర్లక్ష్యంగా వ్యవహరించటం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

ప్రజాశక్తి - గణపవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్ అన్నారు. మండలంలో మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, మల్లపురాజుపేట, జల్లి కాకినాడ గ్రామాల్లో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ ప్రజలు ఎవరి ఒత్తిడిలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, రైటర్ రత్నప్రసాద్, పోలీస్ సిబ్బంది సాయిధ దళాలు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

భీమవరం రూరల్ : ఓటు విలువ తెలుసుకుని, ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్ఆర్‌డిఎస్ కళాశాల ప్రిన్సిపల్ వికెజె.సత్యనారాయణ అన్నారు. కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ అధ్వర్యంలో ఓటువిలువ - ఓటువినియోగం అంశంపై శనివారం సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఓటుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అద్వితీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఓటు రాజ్యాంగ ప్రకారం లభించిందని, దానిని గౌరవించి నిజాయతీగా ఓటు వేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, పీడీ ధనుంజయ్, సత్యనారాయణ, పి.అమూల్యరావు, నరసింహరావు పాల్గొన్నారు.

వరి పంటను నిరంతరం సంరక్షించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజలకు తిండి పెట్టే వరి పంటను నిరంతరం జాగ్రత్తగా సంరక్షించాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రిన్సిపల్, శాస్త్రవేత్త డాక్టర్ పివి.రమణారావు అన్నారు. మార్టేరు వరి పరిశోధనా స్థానం క్షేత్ర సందర్శనకు రంపచోడవరం వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు శనివారం వచ్చారు. వారికి రమణారావు వరి పంట గురించి వివరించారు. వరిలో రకాలు, సస్యరక్షణ, చీడ పీడల నివారణ గురించి, మార్టేరు స్థానం నుంచి రూపొందిన వరి వంగడాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బీచ్‌లో క్రైస్తవుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం, కెపి.పాలెం బీచ్‌కు శనివారం క్రైస్తవులు పోటెత్తారు. ఏసుప్రభు శ్రమకాల దీక్ష ముగింపు సందర్భంగా కెపి.పాలెం బీచ్‌లోని వేలంకిని మాత ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో శుక్రవారం రాత్రి నుంచి క్రైస్తవులు తరలివచ్చారు. వేలంకిని మాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి దీక్ష విరమించారు. అనంతరం సముద్ర స్నానాలు ఆచరించారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

నరసాపురం అభివృద్ధికి కృషి : ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గ చరిత్రలో ఏ ప్రభుత్వాలు చేయనటువంటి అభివృద్ధిని చేసి ఓట్లు అభ్యర్థిస్తున్నాని చీఫ్ విప్, ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని బియ్యపుతిప్పలో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో వైసిపి నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. ఇంటిటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బర్రి వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆదర్శంగా వైసిపి పాలన

సిఎం జగన్ పాలన ఆదర్శంగా సాగుతుందని, సచివాలయ సేవలు, ఆర్‌బికెలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను తీసుకొచ్చిన ఘనత వైసిపికే దక్కుతుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రజలు వైసిపికే ఓటు వేసి గెలిపించాలని కోరారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి వేములదీవి ఈస్ట్ ఘంటసాలవారిమెరకలో మార్నింగ్ వాక్ చేస్తూనే ప్రసాదరాజు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎన్నికల సీజన్ కావడంతో ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఇంటింటికి వెళ్లి వైసిపి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, తిరుమాని శ్రీను, సంగాని మోహన్‌రావు పాల్గొన్నారు.

'వైసిపి విజయానికి సహకరించాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి విజయానికి సహకరించాలని చీపురు ప్రసాదరాజు సతీమణి శారదావాణి ప్రజలను కోరారు. మండలంలోని పేరుపాలెం ఏటిమొండి గ్రామంలో శనివారం ప్రజాశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు విజయానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఆమెతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - ఆకివీడు

ఎన్నికల నోటిఫికేషన్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ పార్టీలు ప్రచారం ముమ్మరం చేస్తున్నాయి. అందులో భాగంగా టిడిపి ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి మంతెన రామరాజు ప్రతి గ్రామానికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఆయన సతీమణి మంతెన సుష్మ మహిళ కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్నారు. నాలుగు రోజులుగా మండల కేంద్రం ఆకివీడు పట్టణంలో ఇంటింటికి తిరుగుతున్నారు. ఇప్పటికే 17, 18, 19, 3, 4, 5 వార్డుల్లో ఆమె ప్రచారం చేశారు.

వైసిపిలో చేరిక

ఆచంట : పెనుగొండ మండలం ఇలపర్రు శివారు గుడిపాడుకు చెందిన శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన మహిళలు, ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన యువకులు సుమారు 200 మంది దండు పద్మావతి ఆధ్వర్యంలో శనివారం వైసిపిలోకి చేరారు. వారికి తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సిఎం జగన్ పాలన చేస్తున్నారన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఉండి

స్థానిక పారిశ్రామిక శిక్షణ కేంద్రం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భీమవరం నుంచి ఉండి వైపు వస్తున్న ద్విచక్రవాహనదారుడు ఉండి నుంచి భీమవరం వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని భీమవరం ఆసుపత్రికి తరలించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఉండి

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారకాతిరుమల మండలంలోని సిహెచ్.పోతేపల్లి గ్రామానికి చెందిన కటారి రాజకుమార్ 13 మద్యం సీసాలను తరలిస్తుండగా ఆరేడు చెక్ పోస్ట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రమాదకరంగా ఫుట్‌పాత్ వంతెన

విరిగిపోయిన రెయిలింగ్
భయాందోళనలో ప్రజలు
పట్టించుకోని అధికారులు

రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న

ప్రజాశక్తి - ఆకివీడు

రెయిలింగ్ విరిగిపోయిన ఫుట్‌పాత్ వంతెన ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు. మండలంలోని శివారు ప్రాంతం కొల్లేరు. అక్కడ రాజులపేట శివారు కొత్తచెరువు గ్రామానికి వెళ్లేందుకు మార్గంలో ఉన్న ఓల్డ్‌వయ్యేరుపై సుమారు రెండు దశాబ్దాల క్రితం ఫుట్‌పాత్ వంతెన నిర్మించారు. ఈ వంతెన సుమారు నాలుగు అడుగుల వెడల్పు ఉంటుంది. ఈ వంతెనపై నుంచి మోటార్‌సైకిల్, నడకదారి మాత్రం సాగించగలుగుతారు. కొత్తచెరువు గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన గ్రామం రాజులపేటకు మధ్యలో వెంకయ్యకాలువకు కుల్లేటిపాయ కాలువైన ఓల్డ్ వయ్యేరు కాలువ ఉంది. కాలవగట్టు నుంచి లోపలికి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ దూరం వెళ్తే పూర్తిగా దళితవాడ కొత్తచెరువు గ్రామం ఉంది. ఈ గ్రామస్తులు ప్రధాన గ్రామానికి రావడానికి, లేదా ఇతర ప్రాంతాలకు, మండల కేంద్రానికి రావడానికి మార్గం లేక కాలింగిగూడెం మీదుగా సుమారు రెండున్నర కిలోమీటర్లపైగా నడిచి రావాల్సి వచ్చేది. ఆ దశలో ఎన్నోసార్లు ఎన్నో విజ్ఞప్తుల మేరకు ఈ ఫుట్‌పాత్ వంతెన నిర్మించారు. ఈ వంతెనకు నాలుగు అడుగుల ఎత్తులో రైలింగ్స్ నిర్మించారు. ఇనుప గొట్టాలతో ఈ రైలింగ్ ఏర్పాటు చేశారు. ఈ ఇనుప గొట్టాలు ఎండకు ఎండి, వర్షానికి తడిసి విరిగిపోయాయి. ఈ వంతెనపై నుంచి ప్రయాణించేందుకు వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. పొరపాటున సైకిల్ గాని, బైక్ గాని అదుపుతప్పితే కాలవలో పడిపోయే ప్రమాదం ఉంది. వేసవికాలంలో కాలువలో బురద ఉంటుంది. మిగిలిన కాలాల్లో మునిగిపోయేంత నీరు ఉంటుంది. కాలువలో పడినట్లు వెంటనే తెలియకపోతే కొల్లేటిలోకి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఇంతటి ప్రమాదకరమైన పరిస్థితిలో కూడా రైలింగ్ పోయి సుమారు నాలుగేళ్లు దాటినా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించడంలేదని వాపోతున్నారు. అనేకమంది పలుమార్లు కాల్వలో పడిపోయారని, తిరిగి వంతెన పట్టుకుని కర్రల సాయంతో గట్టు సాయంతో వచ్చారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన తగు స్థాయిలో తిరిగి చేపట్టాలని, కనీసం అప్పటివరకు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామాలాభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - పెనుగొండ

సంక్షేమ పాలనతో పాటు గ్రామాలభివృద్ధికి కృషి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని వడలి గ్రామంలో ఆయన శనివారం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

1న విద్యుత్ సరఫరా నిపిపివేత

ప్రజాశక్తి - ఉండి

33/11 కెవి ఉండి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం ఏప్రిల్ ఒకటో తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉండి, వెలివర్రు, చిలుకూరు, ఎన్ఆర్‌పి అగ్రహారం, పెదపుల్లేరు, చెరుకువాడ, కలిసిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టిడిపిలోకి గాదె వెంకన్న

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ గాదె వెంకన్న టిడిపిలో చేరారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చేస్తున్న ప్రజాసేవకు ఆకర్షితుడై టిడిపిలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఎంఎల్‌ఎ ఆయనకు టిడిపి కండువా కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జివి, వాణిజ్య విభాగం నేతలు బాలి ఏడుకొండలు, రేపాక ప్రవీణ్, ధనాని సూర్యప్రకాష్, గాదె సుబ్బారావు పాల్గొన్నారు.

జోరుగా పివిఎల్ పర్యటన

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో వైసిపి ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైసిపికి ఓటు గెలిపించాలని కోరారు.

నరసాపురంలో 10కె రన్

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్‌కుమార్ అన్నారు. శనివారం 10కె రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13 ఏళ్లుగా రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. నరసాపురంలోని థామస్ బ్రిడ్జి వద్ద నుంచి ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆరాధన టివి, రన్ ఫర్ జీసెస్ కో-ఆర్డినేటర్ టి.సంజయ్ కిషన్, వైపిఎఫ్ ప్రెసిడెంట్ బి.అజారాయజాన్, న్యూ లైఫ్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ వై.జాన్‌కుమార్, ప్రొఫెసర్ జి.సుధీర్, మైలబత్తుల శాంతరాజు, ఎండి.పాల్‌రాజు, జి.షలేమురాజు, కెఎస్.ప్రకాష్, ఎం.ప్రసాద్, మనోహర్ పాల్గొన్నారు.

పేరుపాలెంలో 'జనంలోకి జనసేన'

ప్రజాశక్తి - మొగల్తూరు

రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరించాలని ఆ పార్టీ నరసపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ ప్రజలను కోరారు. పేరుపాలెం సౌత్ గ్రామంలో జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి జనసేన ఎన్నికల మేనిఫెస్టో వివరించారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి గోపీకృష్ణ, వలవల నాని, బందెల రవీంద్ర, గుబ్బల మార్రాజు, వాతాడి కనకరాజు, బొడ్డు త్రిమూర్తులు, ఉప్పులూరి రాంబాబు, వనమాలి శ్రీను, తోట వెంకటేష్, అంద్రాజు రామన్న, అందే దొరబాబు, గాది వాసు, పోలిశెట్టి నళిని, ఇంటి మురళి, అందే జగదీష్, గుండుబోగుల ఠాగూర్, చింతా శ్రీను, కొల్లు ముత్యాలు, మోకా ఏడుకొండలు, గజ్జరపు మురళి, దాసరి కృష్ణాజీ, లక్కు బాబి, ఒడుగు ఏసుబాబు పాల్గొన్నారు.

పెంటపాడులో 'పల్లెపోరు'

తాడేపల్లిగూడెం : పెంటపాడు మండలం పెంటపాడు గ్రామంలో రెండో రోజు శనివారం నిర్వహించిన పల్లెపోరు కార్యక్రమంలో జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి పాల్గొన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, దాసరి అప్పన్న, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - మొగల్తూరు

జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి పలువురు పార్టీలోకి చేరడం శుభసూచికమని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. రామన్నపాలెం పంచాయతీ పరిధి పిట్టావారిపేటకు చెందిన పలువురు వర్ధనపు ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి నాయకర్ పార్టీ కండువాలు కప్పి సాదారంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కలవకొలను తాతాజీ, వలవల నాని, కొల్లాటి గోపీకృష్ణ, ఆకన చంద్రశేఖర్, బందెల ఎలీషా, రవీంద్ర, యాకోబు, నిప్పులేటి తారకరామారావు, పిప్పళ్ల రామకృష్ణ, అందే దొరబాబు, ఉప్పులూరి రాంబాబు, ఆకన ప్రకాష్, పిట్టా రత్నరాజు, కుసుమ కిరణ్, నల్లి నాగరాజు, కప్పల నిఖిల్, కిరణ్, నల్లి బులిరాజు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో చలివేంద్రాలు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో మానవత సంస్థ ఆధ్వర్యంలో వేసవి సందర్భంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మానవత జిల్లా కన్వీనర్ కాకర్ల వినాయక తెలిపారు. మానవత సంస్థ మండల కమిటీ సమావేశం స్థానిక కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి సంస్థ అధ్యక్షులు కంతేటి కృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వినాయక మాట్లాడుతూ అర్థవరం హైస్కూల్‌లో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించడానికి వీలుగా రూ.18 వేలు ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌కి ఇచ్చినట్లు చెప్పారు. గణపవరం శ్మశానవాటికలో ఉన్న ఫ్రీజర్ల కాపలాదారుడు గంజి వెంకన్నకు వేతనం కింద రూ.ఆరు వేల చెక్కును అందించినట్లు చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో గతేడాదిలో జరిగిన కార్యక్రమాల జమా ఖర్చులు కేంద్ర కమిటీకి అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ కార్యదర్శి ఎం.చిరంజీవిరావు, ఉపాధ్యక్షులు వంకాయల రామారావు, కమిటీ సభ్యులు ఎండి రఫీ, సాగిరాజు సుబ్బరాజు, బొడ్డు శ్రీనివాసరావు, పెరుమాళ్ ఆంజనేయులు, దండు బంగారురాజు పాల్గొన్నారు.

నాగన్నకు చెక్కు అందిస్తున్న కాకర్ల వినాయక

వ్యవసాయ రంగాన్ని ఆదర్శంగా నిలపాలి

ప్రజాశక్తి - వీరవాసరం

దేశంలో రాజకీయ, సినిమా పరిశ్రమ రంగాల్లో వారసులు వస్తున్నారు గాని వ్యవసాయ రంగంలోకి వారసులు రాకపోవడానికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలేనని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ విమర్శించారు. మండల ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం మండలాధ్యక్షులు రెడ్డి రామారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన హరేరామ్ మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరలు కల్పించకుండా వ్యవసాయ రంగాన్ని నష్టాల పాలు చేస్తే రైతులు నష్టపోతే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పడానికి తేలిగ్గా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థల ద్వారా ఎన్నికల బాండ్లు తెచ్చుకుని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి కుయత్తులు పన్నుతుందన్నారు. సాగునీటి కాలువలు, మురుగు డ్రెయిన్ల ప్రక్షాళన చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోని కారణంగా సాగు, తాగు నీటి ఎద్దడి ఏర్పడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కార్యదర్శి తాళ్లూరి హరిహరరామలక్ష్మణ్, యాళ్ల బండి నారాయణమూర్తి, సూర్యచంద్రం, గొట్టుముక్కల శ్యామ్ పాల్గొన్నారు.

జెవిఆర్ మృతి తీరనిలోటు

సంతాప సభలో మాజీ మంత్రి పితాని, మాజీ ఎంఎల్‌ఎ బండారు

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి సీనియర్ నాయకులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు (జెవిఆర్) మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు అన్నారు. మండలంలోని కాళీపట్నం పడమరలో జక్కంశెట్టి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద శనివారం నిర్వహించిన సంతాపసభలో వారు పాల్గొని మాట్లాడారు. పార్టీకి జెవిఆర్ పెద్దదిక్కుగా ఉండేవారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ ఉన్నతికి ఆయన కష్టపడి పని చేశారన్నారు. ఆ ప్రాంతానికి ఆ కాలంలో రవాణా సౌకర్యం లేకపోయినా పార్టీకి సంబంధించిన ఏ కార్యక్రమం నిర్వహించినా వ్యయప్రయాసలు పడి మరీ పాల్గొనేవారన్నారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఎన్నో పదవులు చేసిన ఆయన ఎప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాపత్రయ పడుతుండేవారన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో పొత్తూరి రామరాజు, కుక్కల మీరయ్య, గూడూరి ఉమాబాల, ప్రసాద్, గుబ్బల నాగరాజు, తంగేళ్ల నాగేశ్వరరావు, కవురు ఆదినారాయణ, కొట్టు పండు, కొండేటి శ్రీను, ముచ్చర్ల శ్రీను, మంద్రు హేమలత, పెదసింగు భాస్కరరావు, నడిపుడి కృష్ణ, గుబ్బల వీరాస్వామి, కవురు రంగ, గుబ్బల మహేష్, మామిడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులు ప్రత్యేక ఉపన్యాసాలను వినియోగించుకుని తమ విద్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీలో ఆంగ్లంపై నైపుణ్యం జీవన నైపుణ్యాలు (లైఫ్ స్కిల్)పై శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు కెఎస్.రత్నకుమార్ విద్యార్థులకు ఆంగ్లం భాష నైపుణ్యం మెలకువలు వివరించారు. అనంతరం రత్నకుమార్‌ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు టి.అక్కిరాజు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వలిని కలిసిన శ్రీనివాసరవర్మ

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడును నరసాపురం పార్లమెంట్ కూటమి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఎంపీగా తనను గెలిపించేందుకు కృషి చేయాలని రామ్మోహన్ నాయుడును శ్రీనివాస్ వర్మ కోరారు. అనంతరం శ్రీనివాస్‌వర్మనుకు రామ్మోహన్‌నాయుడు శాలువ కప్పి సత్కరించారు. తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన జగన్

ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - వీరవాసరం

పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వాన్ని ప్రజల ముంగిటకు తీసుకొచ్చిన నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైసిపి భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైసిపి కార్యకర్తలతో శనివారం తోకలపూడి, చింతలకోటిగరువు, వీరవల్లిపాలెం, రాయకుదురు, వీరవాసరం, పెర్కిపాలెం, వడ్డిగూడెం, నంమూరుగరువు, దూసనపూడిల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో ఏ విధమైన ఆలోచనలతో ముందుకెళ్లాలో గ్రంధి శ్రీనివాస్ కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యకర్త వారి పరిచయాలను వైసిపి ఓట్లుగా మలచాలన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథాకాల లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ చెప్పింది చేసిన వ్యక్తిగా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుర్తించారన్నారు. తన పనితీరు, ఆయన సామర్థ్యం మెచ్చి మరోసారి భీమవరం అభ్యర్థిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, సర్పంచి గెడ్డం భారతీభాస్కరావు, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యానారాయణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పోలిశెట్టి సత్యానారాయణ, పోలిశెట్టి చంటి, వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు పాల్గొన్నారు.

పాలనంటే కక్ష సాధింపులు, బెదరింపులు కావు

జనసేన భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి అంజిబాబు

భీమవరం రూరల్ : పాలన అంటే కక్ష సాధింపులు, బెదరింపులు కాదని, అందరిని కలుపుకుని వెళ్లడమేనని జనసేన భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం 34వ వార్డులో ఆత్మీయ సమావేశాన్ని యాసా అనిల్, కొండవీటి విజయ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ మారాలంటే ఓటుతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో జగన్ పాలనలో హంగులే తప్ప అభివృద్ధి లేదన్నారు. సంక్షేమం, అభివృద్ధి కూటమి ద్వారా సాధ్యమవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఎన్నో సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. 34వ వార్డు అంటే టిడిపి, జనసేన పార్టీలకు కంచుకోట అని అన్నారు. ప్రజల ఆశయాల కోసమే కూటమి ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. భీమవరం పట్టణాన్ని సుందరీకరణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వేగేశ్న కనకరాజు సూరి, పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ గాదిరాజు తాతారాజు, బంగార్రాజు, గంటా త్రిమూర్తులు, పంతం సతీష్, గురుమూర్తి పాల్గొన్నారు.

మూడు చక్రాల సైకిల్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు టిడ్కో గృహ సముదాయాల్లో నివసిస్తున్న మానసిక వికలాంగుడు బొల్లా చరణ్‌కు శనివారం రూ.ఏడు వేల విలువైన మూడు చక్రాల సైకిల్ వాకర్స్ క్లబ్ తరపున క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్, సభ్యుల చేతుల మీదుగా అందించారు. మూడు చక్రాల సైకిల్ క్లబ్ సభ్యుడు దేవత రవి సమకూర్చారు. ఈ సందర్భంగా వికలాంగుని తల్లితండ్రులు వాకర్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, నంబూరి గంగా పవన్ పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన కొత్తపల్లి

నరసాపురం : కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి మొదలవుతున్న ఎన్నికల శంఖారావం సందర్భంగా జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను పిఠాపురంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు కలిశారు. ఈ సందర్భంగా నరసాపురంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఇటీవల జనసేనలో చేరిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడును పిఠాపురం ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. No. 329/2023

Between:

వాది:

పిసిని నాగబాబు, S/o. రామారావు, R/o. శృంగవృక్షం, పాలకోడేరు మండలం.

ప్రతివాది:

ఇందుకూరి శ్రీనివాస నాగరాజు, S/o. రామకృష్ణంరాజు, R/o. డో.నెం. 3-63, రాజులపేట, జానకీ రామరాజపురం, H/o. చినకాపవరం, ఆకివీడు మండలం, సెల్: 77320 96546.

పై నెంబరు దావాలో వాది అయిన పిసిని నాగబాబు, ప్రతివాది అయిన ఇందుకూరి శ్రీనివాస నాగరాజు అను మీకు కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ అందుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఆ విషయమై కోర్టులో పిటీషను దాఖలు చేసినందున, పై దావా విషయంలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల **ది. 11-04-2024వ సం॥ తేదీన ఉదయం గం॥ 10.00 ని॥లకు** స్వయంగా గానీ, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసింది. లేని ఎడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 11-04-2024

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పాకా రమేష్‌బాబు
కట్టా మాలతీలత
అడ్వకేట్స్, భీమవరం
సెల్: 9701842726

భీమవరం
30-3-2024

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A. No. 365/2023 in O.S. No. 329/2023

Between:

పిటీషనర్/వాది:

పిసిని నాగబాబు, S/o. రామారావు, R/o. శృంగవృక్షం, పాలకోడేరు మండలం.

రెస్పాండెంట్/ ప్రతివాది:

ఇందుకూరి శ్రీనివాస నాగరాజు, S/o. రామకృష్ణంరాజు, R/o. డో.నెం. 3-63, రాజులపేట, జానకీ రామరాజపురం, H/o. చినకాపవరం, ఆకివీడు మండలం, సెల్: 77320 96546.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు అయిన పిసిని నాగబాబు, రెస్పాండెంటు అయిన ఇందుకూరి శ్రీనివాస నాగరాజు అను మీకు కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ అందుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఆ విషయమై కోర్టులో పిటీషను దాఖలు చేసినందున, పై పిటీషను విషయంలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల **ది. 11-04-2024వ సం॥ తేదీన ఉదయం గం॥ 10.00 ని॥లకు** స్వయంగా గానీ, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసింది. లేని ఎడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 11-04-2024

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పాకా రమేష్‌బాబు
కట్టా మాలతీలత
అడ్వకేట్స్, భీమవరం
సెల్: 9701842726

భీమవరం
30-3-2024

వేలము ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 38/2023 in O.S. No. 26/2009

బిట్వీన్:

పట్నాల మల్లిఖార్జునరావు @ మల్లేశ్వరరావు ...D.H.R

మరియు

శ్రీమతి వీర్ల వెంకట మాణిక్యాంబ ...J.D.R.

పై నెంబరు గ్రంధములో డి.హెచ్.ఆర్. గారు వారికి రావలసిన బాకీ వసూలు కొరకు జె.డి.ఆర్ పై దావా వేసి డిక్రీ పొంది సదరు డిక్రీ బాకీ తీర్మానము కొరకు జె.డి.ఆర్. హక్కు భుక్తములు కల్గిన యీ దిగువ షెడ్యూల్ స్థిరాస్తిని **ది. 15-04-2024వ తేదీ ఉదయం 10 గం॥ 30 ని॥ల** లగాయతు పై కోర్టు వారు బహిరంగ వేలము జరిపించెదరు. గాన పాడుకొనలదచినవారు పై తెల్పిన తేదీన శ్రీ కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

SCHEDULE

West Godavari District, Tadepalligudem Sub-Registry, Pentapadu Mandal, Prathipadu Panchayat, with an extent of Ac. 1-43 cents of dry-land, covered by R.S. No. 173/2, 3 which is bounded by:

EAST: Land belongs to Veerla Ramachandra Rao. **SOUTH:** Land belongs to Veerla Satyavathi. **WEST:** Land belongs to Veerla Ramachandra Rao and Sri Goutham Budda Minorities Education Society, Tanuku. **NORTH:** Land belongs to Sri outham Budda Minorities Education Society, Tanuku and the belongs to Naraharasetty Usha Rani.

Within the above boundaries an extent of Ac. 1-43 cents of dry-land is situated therein.

DHR Value: Rs. 20,00,000/-

Amina Value: Rs. 64,00,000/-

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మద్దా శ్రీనుబాబు
DHR తరపు న్యాయవాది
తాడేపల్లిగూడెం
సెల్: 9963739591

తాడేపల్లిగూడెం
ది.30-3-2024